APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ మంగళవారం 04 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :68 పేజీలు : 04 వెల: 2-00/-



## భారత్ - ఉజ్బెకిస్థాన్ సహకారానికి ఊతం

- ఉజ్బెకిస్థాన్ మంత్రితో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ భేటీ
- వాణిజ్యం, పెట్టుబడులు, ఔషధ రంగాలపై విస్తృత చర్చలు
- డిజిటల్ సాంకేతికత, తయారీ రంగాల్లో సహకారం విస్తరణపై దృష్టి
- ద్వైపాక్షిక భాగస్వామ్యంతో కొత్త అవకాశాలు సృష్టిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 3 : కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ఉజ్బెకిస్థాన్ పెట్టుబడులు, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి లజీజ్ కుద్రతోవ్‌తో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశంలో విస్తృతంగా చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే అంశాలపై ఇరు దేశాల ప్రతినిధులు అభిప్రాయాలు పంచుకున్నారు. సమావేశంలో ప్రధానంగా వాణిజ్యం, పెట్టుబడులు, ఔషధ తయారీ, అనుసంధాన మౌలిక వసతులు, డిజిటల్ సాంకేతికత, తయారీ రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించే అంశాలపై చర్చించారు. ఇరు దేశాల మధ్య వ్యాపార అవకాశాలను పెంపొందించేందుకు అవసరమైన చర్యలపై సానుకూలంగా చర్చలు జరిగినట్లు పీయూష్ గోయల్ తెలిపారు. భారత్--ఉజ్బెకిస్థాన్ మధ్య పెరుగుతున్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలు ఇరు దేశాల పరిశ్రమలకు కొత్త అవకాశాలను కల్పిస్తాయని మంత్రి పేర్కొన్నారు. పెట్టుబడుల ప్రోత్సాహం, పరిశ్రమల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ఉభయ దేశాలు కట్టుబడి ఉన్నాయని వెల్లడించారు. ఔషధ రంగం, తయారీ రంగం, డిజిటల్ సాంకేతికతలో భారతదేశానికి ఉన్న అనుభవం, ఉజ్బెకిస్థాన్‌లోని పెట్టుబడి అవకాశాలు కలిసి పరస్పర అభివృద్ధికి దోహదపడతాయని సమావేశంలో అభిప్రాయపడ్డారు.

## రాయలసీమ అభివృద్ధికి ప్రణాళిక అవసరం



- 'రైజింగ్ రాయలసీమ' కార్యక్రమంలో పాల్గొన్న పీవీఎన్ మాధవ్
- రాయలసీమ వెనుకబాటుతనంపై ఆందోళన వ్యక్తం
- నాయకులు, మేధావులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు

కర్నూలు, ఆగస్టు 3: కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో సమర్థ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైజింగ్ రాయలసీమ' కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. రాయలసీమ ప్రాంత ప్రస్తుత పరిస్థితులు, అభివృద్ధి అవకాశాలు, భవిష్యత్ కార్యాచరణపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాయలసీమ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబాటుకు గురైందని అన్నారు. ఈ ప్రాంతంలో సహజ వనరులు, మానవ వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ వాటిని సమర్థంగా వినియోగించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఫలితంగా ఈ ప్రాంత ప్రజలు ఇప్పటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాయలసీమ నుంచి పలువురు ముఖ్యమంత్రులు ప్రాతినిధ్యం వహించినప్పటికీ, ప్రాంతం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందకపోవడం బాధాకరమని పీవీఎన్ మాధవ్ అన్నారు.



## ఎన్ఐఎస్ బాక్సింగ్ కోచ్‌కు సన్మానం

- గేయామృతను అభినందించిన అచ్చెన్నాయుడు
- జిల్లాలో తొలి ఎన్ఐఎస్ బాక్సింగ్ కోచ్‌గా గుర్తింపు
- యువ క్రీడాకారులకు ఆదర్శమని ప్రశంసలు
- గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం కొనసాగుతుందని వెల్లడి

శ్రీకాకుళం, ఆగస్టు 3 : శ్రీకాకుళం జిల్లాలో తొలి జాతీయ క్రీడా సంస్థ (ఎన్ఐఎస్) బాక్సింగ్ కోచ్‌గా గుర్తింపు పొందిన టెక్కలి మండలం బన్నువాడ గ్రామానికి చెందిన బొడ్డ గేయామృతను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. నిమ్మాడలోని శిబిర కార్యాలయంలో గేయామృతను ఘనంగా సన్మానించి ఆమె సాధించిన విజయాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రంలో శిక్షణ పొందిన గేయామృత క్రమశిక్షణ, పట్టుదలతో భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పంజాబ్‌లోని పటియాలాలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక అఖిల భారత కోచ్‌ల శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఆమె సాధించిన విజయం జిల్లాలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో గేయామృత మరెందరో జాతీయ, అంతర్జాతీయ స్థాయి బాక్సర్లను తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఆమె సాధించిన ఈ ఘనతతో శ్రీకాకుళం జిల్లా క్రీడారంగంలో మరింత గుర్తింపు పొందుతుందని అన్నారు. గేయామృత విజయానికి సహకరించిన ఆమె తండ్రి బొడ్డ నాగేశ్వరరావు, శిక్షణ అందించిన కోచ్ నర్సిపురం శేఖర్ సేవలను అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

## టీడీపీ శిక్షణా తరగతులకు ఊతం



**మంగళగిరిలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన దేవినేని ఉమ**

**పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన**

**సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపు**

**కార్యకర్తలే పార్టీకి నిజమైన బలమని వ్యాఖ్య**

మంగళగిరి, ఆగస్టు 3 : తెలుగుదేశం పార్టీ శ్రేణులను సమర్థ నాయకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన యూనిట్ ఇన్‌చార్జిల శిక్షణా తరగతుల్లో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ సంస్థాగత బలోపేతానికి అవసరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలతో మరింత సన్నిహితంగా మమేకమై పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు. శిక్షణా కార్యక్రమాల్లో పార్టీ సిద్ధాంతాలు, ప్రజలతో మమేకమయ్యే విధానం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా వివరించే నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాల పెంపుపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

## ప్రధానితో లావు శ్రీకృష్ణదేవరాయలు భేటీ

- పల్నాడు అభివృద్ధి నివేదికను అందజేసిన లావు శ్రీకృష్ణదేవరాయలు
- ఆర్థిక చేరిక, రుణాల విస్తరణపై వివరాలు వెల్లడింపు
- సాగునీటి ప్రాజెక్టులకు సహకారం అందించాలని ప్రధానికి విజ్ఞప్తి
- పల్నాడును సమగ్ర ఆర్థికాభివృద్ధి జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వివరించిన ఎంపీ



న్యూఢిల్లీ, ఆగస్టు 3 : పల్నాడు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "పల్నాడు: ఆర్థిక పరివర్తన గాథ" పేరుతో రూపొందించిన ప్రత్యేక నివేదికను ప్రధానమంత్రికి అందజేశారు. పల్నాడులో ఆర్థిక చేరిక, సంస్థాగత రుణాల విస్తరణ, సమగ్ర అభివృద్ధి దిశగా సాధించిన పురోగతిని నివేదికలో వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, పల్నాడు నియోజకవర్గంలో రూ.3,216 కోట్ల సంస్థాగత రుణాలను మంజూరు చేసి మొత్తం 1,03,246 మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించినట్లు ప్రధానమంత్రికి వివరించారు. వీరిలో 70 వేల మందికిపైగా తొలిసారిగా బ్యాంకు రుణాలు పొందిన వారేనని తెలిపారు. రైతులు, మహిళలు, యువత, చిన్న వ్యాపారవేత్తలు అధికారిక ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు కావడానికి ఈ కార్యక్రమం దోహదపడిందని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు అపార అవకాశాలు ఉన్నాయని ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ తెలిపారు. సమగ్ర, సుస్థిర ఆర్థికాభివృద్ధి నమూనాగా పల్నాడును తీర్చిదిద్దే కార్యాచరణను వివరించినట్లు చెప్పారు. దేశ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రధానమంత్రిని కోరారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల బలోపేతానికి అవసరమైన మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు.



## అర్హులందరికీ 'నేతన్న సేవలో' పథకం: మంత్రి సవిత

అమరావతి, ఆగస్టు 3 అనంత సూర్య: అర్హులైన ప్రతి చేనేతకు 'నేతన్న సేవలో' పథకం ద్వారా ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు చీరాలలో ఈ పథకాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ పథకానికి దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 5 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని, అర్హులైన చేనేతలు తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని



కోరారు. ఎన్నికల్లో హామీ ఇవ్వక పోయినా చేనేతల సంక్షేమం కోసం 'నేతన్న సేవలో' పథకాన్ని అమలు చేస్తున్నామని, చేనేతలకు గౌరవ ప్రదమైన జీవనం కల్పించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. పథకం అమలులో ఎలాంటి విమర్శలకు తావులేకుండా అధికారులు పారదర్శకంగా పని చేయాలని ఆదేశించారు. ఆగస్టు 7న చీరాలలో జరిగే జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని, రాష్ట్రవ్యాప్తంగా కూడా చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సోసిడియా, కమిషనర్ రేఖారాణి, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్లు, ఆప్కో అధికారులు పాల్గొన్నారు.

# 80వ స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



♦ జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్

అనంతపురం, ఆగస్టు 3 అనంత సూర్య: ఈ నెల 15న నిర్వహించనున్న 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలకు సందేశం ఇస్తారని తెలిపారు. బందోబస్తు, ట్రాఫిక్, పార్కింగ్, సీటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, తాగునీరు, అగ్నిమాపక భద్రత, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అన్ని ఏర్పాట్లను సంబంధిత శాఖలు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రదర్శన స్టాళ్లు, స్వచ్ఛాంధ్ర శకటాలు ఏర్పాటు చేయాలని, వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందిస్తున్న ఉద్యోగుల వివరాలను అవార్డుల కోసం పంపించాలని ఆదేశించారు. సమావేశంలో అనంతపురం ఆర్డీఓ ప్రేమంత్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అనంతపురం జిల్లా డీఈఓగా అయూబ్ ఖాన్ నియామకం

అనంతపురం, ఆగస్టు 3 అనంత సూర్య: అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)గా అయూబ్ ఖాన్‌ను రాష్ట్ర విద్యాశాఖ నియమించింది. ఈ మేరకు ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కర్నూలు జిల్లా డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న అయూబ్ ఖాన్‌కు అనంతపురం జిల్లా డీఈఓ బాధ్యతలు అప్పగించారు. గతంలో డీఈఓగా ఉన్న ప్రసాద్‌బాబు బదిలీ అయిన అనంతరం ఆ పదవి ఖాళీగా ఉండగా, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు ఇన్‌చార్జ్ డీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహించారు. పూర్తి స్థాయి డీఈఓ నియామకం కోసం విద్యాశాఖ వర్గాలు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అయూబ్ ఖాన్‌ను నియమించింది. అయూబ్ ఖాన్‌కు విద్యాశాఖలో సుదీర్ఘ అనుభవం ఉండగా, మరో నాలుగు నెలల్లో ఆయన పదవీ విరమణ చేయనున్నట్లు సమాచారం. జిల్లా విద్యాశాఖ పరిపాలనను గాడిలో పెట్టేందుకు ఆయన చర్యలు తీసుకుంటారనే ఆశాభావాన్ని ఉపాధ్యాయ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.



# బియ్యం ధరల నియంత్రణకు 15 మండలాల్లో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ప్రారంభం

**కొత్తచెరువులో కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్**

కొత్తచెరువు, ఆగస్టు 3 అనంత సూర్య: బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించేందుకు శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. కొత్తచెరువు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్కెట్‌లో బియ్యం ధరలు సాధారణ స్థితికి చేరుకునే వరకు ఈ కేంద్రాలు కొనసాగుతాయని తెలిపారు. నాణ్యతలో రాజీ లేకుండా స్టీమ్ రైస్ (బీపీటీ) కిలో రూ. 52, ముడి బీపీటీ బియ్యం కిలో రూ. 50 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల ద్వారా బియ్యం కొనుగోలు చేసి ప్రయోజనం పొందాలని సూచించారు. జిల్లాలోని రొద్దం, బత్తలపల్లి, సి.కే.పల్లి, గాండ్లపెంట, గోరంట్ల, హిందూపూర్, కదిరి, కొత్తచెరువు, మడకశిర, ముదిగుబ్బ, పెనుగొండ, పుట్టపర్తి, తాడిమర్రి, ధర్మవరం, లేపాక్షి మండలాల్లో ఈ ప్రత్యేక విక్రయ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.




# ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహణ




అనంతపురం, ఆగస్టు 3 అనంత సూర్య: ఏఐటీయూసీ అనంతపురం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సోమవారం అనంతపురం నగరంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడు బి. మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సంఘ బలోపేతం, కార్మిక సమస్యలు, రానున్న కార్యాచరణపై నాయకులు చర్చించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు సంఘం మరింత సమర్థవంతంగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రాజేష్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిరంజీవి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి వి. కృష్ణుడు, జిల్లా ఆఫీస్ బేరర్స్ రాజు, రామకృష్ణ, శంకర్, ఎస్‌సీఎం భాషా, వెంకటేష్, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అవకతవకలపై వైసీపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, నిరసన







**- పారదర్శక విచారణ జరిపి అభ్యర్థులకు న్యాయం చేయాలని ఉషశ్రీ చరణ్ డిమాండ్**

పరిగి, ఆగస్టు 3 అనంత సూర్య: డీఎస్సీ నియామకాలలో చోటుచేసుకున్న అవకతవకలను నిరసిస్తూ శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో సోమవారం పరిగి మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ, టౌన్ హాల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత లోపించిందని, అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి అర్హులైన ప్రతి అభ్యర్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుపై స్పష్టత లేదని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు.

# క్రీడా మైదానం ఏర్పాటుకు వినతి.




కొత్తచెరువు, ఆగస్టు 03, అనంత సూర్య: పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో నివసించే విద్యార్థులు, యువతకు, క్రీడా మైదానాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి క్రీడ మైదానాలు ఏర్పాటు కొరకు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ  మా ప్రాంతంలో వందలాది మంది యువత , విద్యార్థులు నివసిస్తున్నప్పటికీ, వారికి క్రీడలు ఆడేందుకు సరైన ప్రభుత్వ క్రీడా మైదానం అందుబాటులో లేదనీ. దీనివల్ల యువత తమ క్రీడా ప్రతిభను అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారనీ, ప్రస్తుతం యువతలో ఆరోగ్య సమస్యలు, శారీరక శ్రమ తగ్గడం, మొబైల్ ఫోన్ల వినియోగం పెరగడం ,చెడు అలవాట్ల వైపు ఆకర్షితులయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయనీ. ఇటువంటి పరిస్థితుల్లో ఒక ప్రభుత్వ క్రీడా మైదానం ఏర్పాటు చేయడం వలన యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందనీ, యువతలో శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం  క్రమశిక్షణ పెరుగుతాయి. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్బాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో శిక్షణ పొందే అవకాశం ఉంటుందనీ. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీర్చిదిద్దవచ్చు. పాఠశాలలు, కళాశాలల క్రీడా పోటీలు, మండల, జిల్లా సా-యి టోర్నమెంట్ల నిర్వహణకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, పుట్టపర్తి టౌన్ ప్రెసిడెంట్ కళ్యాణ్, జిల్లా కార్యదర్శి తలమర్ల హరికృష్ణ, బి ప్రసాద్, ఎస్టీ సెల్ జనరల్ సెక్రెటరీ లక్ష్మ నాయక్ నాయక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సింధు, తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై రౌండ్ టేబుల్ సమావేశం





**లోకేష్ రాజీనామా చేయాలి: అనంత వెంకటరామిరెడ్డి**

అనంతపురం, ఆగస్టు 3 అనంత సూర్య: డీఎస్సీ--2025 నియామకాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన అర్బన్ నియోజకవర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత పాటించలేదని ఆరోపించారు. టీచర్ పోస్టుల భర్తీపై సీబీఐతో విచారణ జరిపించి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్ హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు మద్దతుగా ఈ నెల 6 నుంచి 9 వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రిలే నిరాహార దీక్షలు, 10న నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాలకు విద్యార్థులు, య-ువత, మేధావులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన సన్నబియ్యం

**ధర్మవరంలో ప్రత్యేక బియ్యం కౌంటర్ల ప్రారంభం**

**హరీష్ బాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ**




ధర్మవరం, ఆగస్టు 3 అనంత సూర్య: సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన సన్నబియ్యాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం కౌంటర్లలో భాగంగా ధర్మవరం రైతు బజార్‌లో సోమవారం ప్రత్యేక బియ్యం కౌంటర్‌ను ప్రారంభించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, తహసీల్దార్ దేవరాజు, సి.ఎస్.డి.టి. రమణ బాబుతో కలిసి కౌంటర్‌ను ప్రారంభించి లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన బీపీటీ సన్నబియ్యాన్ని సరసమైన ధరలో అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక బియ్యం కౌంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. ధర్మవరం మండలానికి తొలి విడతగా 50 క్వింటాళ్ల బియ్యం కేటాయించగా, ప్రతి కుటుంబానికి నెలకు గరిష్ఠంగా 10 కిలోల వరకు అందజేయనున్నట్లు తెలిపారు. మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకుని సులభంగా బియ్యం కొనుగోలు చేసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని, పంపిణీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం అందించడం ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని హరీష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాంభూపాల్ రెడ్డి, తహసీల్దార్ దేవరాజు, సి.ఎస్.డి.టి. రమణ బాబు, జనసేన నాయకులు రాజారెడ్డి, బీజేపీ నాయకులు నేలకోట రాము, ధనుంజయ, అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతు బజార్ సిబ్బంది, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కొత్తచెరువులో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు





### ♦ ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాలి: సీడీపీఓ జయంతి

కొత్తచెరువు, ఆగస్టు 3 అనంత సూర్య: శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని పుట్టపర్తి సీడీపీఓ ఎ. జయంతి సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమీల ఆదేశాల మేరకు, కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీ పరిధిలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అయ్యగారి రజిత ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ జయంతి మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు పౌష్టికాహారం ప్రారంభించాలని సూచించారు. రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువకాలం తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత, సీహెచ్‌ఓ రుక్సానా, ఏఎన్ఎం శకుంతలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బమ్మ, కృష్ణకుమారి, స్వర్ణలత, నిర్మల, సుశీల, సాయిలీల, భారతి, ఆశా కార్యకర్తలు రత్నమ్మ, అనిత, రామాంజనమ్మ, నాగమణి, కిశోరి బాలికలు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని బీపీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

### ఎస్కేయూ వీసీకి ఏఐఎస్ఎఫ్ వినతిపత్రం



అనంతపురం, ఆగస్టు 3 అనంత సూర్య: తాడిపత్రిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నారాయణ బీపీఈడీ కళాశాలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐఎస్ఎఫ్ ఎస్కేయూ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ, కళాశాలకు అవసరమైన మౌలిక వసతులు, క్రీడా మైదానం లేకపోయినా నిర్వహిస్తున్నారని, ఒకే భవనం నుంచి పలు కళాశాలలను నడుపుతూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. అలాగే తగినన్ని తరగతులు నిర్వహించకుండా, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై విశ్వవిద్యాలయ అధికారులు వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి: జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



పుట్టపర్తి, ఆగస్టు 3 అనంత సూర్య : ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో నిష్పాక్షికంగా విచారించి బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ ప్రజల నుంచి మొత్తం 85 వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను నేరుగా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అందిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును నిష్పాక్షికంగా విచారించి చట్టబద్ధంగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చిన వికలాంగుల వద్దకు స్వయంగా వెళ్లిన ఎస్పీ వారి సమస్యలను ఓపికగా విని, అవసరమైన సహాయ చర్యలు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, అందిన ప్రతి వినతిపై న్యాయపరంగా స్పందిస్తూ బాధితులకు అండగా నిలుస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కుటుంబ వివాదాలు, భూ తగాదాలు, సైబర్ మోసాలు తదితర అంశాలకు సంబంధించిన 85 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురాన (ఐపీఎస్), సీఐలు బొజ్జప్ప, లక్ష్మీకాంత్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలి: సీఐటీయూ డిమాండ్



కదిరి, ఆగస్టు 3 అనంత సూర్య: సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా బియ్యం బస్తాలకు అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కదిరి స్టాక్ పాయింట్‌ను సోమవారం పరిశీలించిన సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నాలుగు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ విధానం వల్ల రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. కదిరి స్టాక్ పాయింట్ పరిధిలో 125 రేషన్ దుకాణాలు ఉండగా, ఇప్పటివరకు కేవలం 55 దుకాణాలకే బియ్యం చేరిందని తెలిపారు. దీంతో మిగిలిన దుకాణాల పరిధిలోని లబ్ధిదారులు ఈ నెల కోటా బియ్యం అందుతుందా లేదా అనే ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. అదే విధంగా క్యూఆర్ కోడ్ విధానం కారణంగా సివిల్ సప్లై హమాలీలపై అదనపు పనిభారం పడుతోందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఈ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. సాంబశివ, పట్టణ కార్యదర్శి ఎ. బాబ్జాన్, హమాలీలు శివ, ఫక్రుద్దీన్, చిన్న ఆంజనేయులు, రాము, చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ ధరకే నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ ప్రారంభం





### ♦ అధికారులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

పుట్టపర్తి, ఆగస్టు 3 అనంత సూర్య: ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన సన్న బియ్యం అందించి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తచెరువు, పుట్టపర్తిలోని గోపురం-3 క్రాస్ వద్ద నిర్వహించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎ. శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజలకు పారదర్శకమైన సుపరిపాలన అందుతోందని, పేదల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి నాణ్యమైన సన్న బియ్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వంశీకృష్ణ, తహసీల్దార్లు నారాయణరెడ్డి, సంహిత, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### 317 అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్



పుట్టపర్తి, ఆగస్టు 3 అనంత సూర్య: ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను కలెక్టర్ స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 317 అర్జీలు అందగా, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్ఓ కొండయ్య, ఎస్‌డీసీ విజయకుమారి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చిత్రావతిలో చెత్త వేయొద్దు.. పుట్టపర్తిని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దుదాం: డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



పుట్టపర్తి, ఆగస్టు 3 అనంత రైటర్స్: పుట్టపర్తి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం చిత్రావతి నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను నదిలో, రోడ్లపై వేయడాన్ని తప్పుబట్టారు. నదీ తీర ప్రాంతాల్లో చెత్త వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రజల సౌకర్యార్థం ప్రధాన ప్రాంతాల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, పరిశుభ్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. చిత్రావతి నది ఆధ్యాత్మిక, పర్యావరణ పరంగా ఎంతో ప్రాముఖ్యత కలిగినదని, దానిని పరిశుభ్రంగా పరిరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. పుట్టపర్తిని రాష్ట్రంలోనే ఆదర్శ పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా టెట్ పరీక్షలు నిర్వహించాలి



### ♦ అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ఆదేశాలు

అనంతపురం, ఆగస్టు 3 అనంత సూర్య: జిల్లాలో ఈనెల 5 నుంచి 16 వరకు జరిగే ఆంధ్రప్రదేశ్ టెట్ (ఏపీటెట్) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి డీఈఓ శ్రీనివాసరావుతో కలిసి నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 18,191 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు హాల్‌టికెట్లతో నిర్దేశిత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షల కోసం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, వికలాంగ అభ్యర్థులకు అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సెక్షన్ 144 అమలు, అవసరమైన బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) నాగభూషణం, డీఆర్ఓ మాలోల, ఇన్‌చార్జి డీఈఓ శ్రీనివాసరావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి, డీఐపీఆర్ఓ బాలకొండయ్య, డీఎంహెచ్‌వో డా. వెంకటేశ్వర్లు, డీపీఓ నాగరాజు నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనంత సూర్య తెలుగువార్త
మంగళవారం 04 ఆగస్టు 2026

# విద్యారంగంలో గుణాత్మక మార్పు తీసుకురావాలి

## ఎంఈఓలు, క్లస్టర్ హెచ్ఎంలకు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ దిశానిర్దేశం



పుట్టపర్తి ఆగస్టు 3 అనంత సూర్య: పాఠశాల విద్యలో నిర్దేశించిన ప్రగతి సూచీల (కేపీఐలు) అమలుతో శ్రీ సత్యసాయి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు.సోమవారం పుట్టపర్తిలోని మంగళకర జూనియర్ కళాశాలలో ఎంఈఓలు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన కేపీఐల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతాన్ని పెంచడంతో పాటు బడి బయట పిల్లలు లేకుండా 'జీరో డ్రాపౌట్' లక్ష్యాన్ని సాధించాలని సూచించారు .ప్రాథమిక సా-ధయిలోనే పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్)పై విద్యార్థులకు పూర్తి పట్టు కల్పించాలని, 10వ తరగతి ఫలితాల్లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.స్టార్ రేటింగ్ తక్కువ ఉన్న పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు ఎస్ఆర్కేవీఎం కిట్ల పంపిణీ, మధ్యాహ్న భోజన నాణ్యత, ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు అవ-సరమైన సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. "కేపీఐలు కేవలం గణాంకాలు కావు..విద్యార్థుల భవిష్యత్తుకు సూచికలు" అని పేర్కొన్న కలెక్టర్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు సమర్థవంతమైన నాయకత్వంతో పనిచేసి జిల్లాను విద్యారంగంలో ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి క్రిస్టప్ప, సమగ్ర శిక్ష అధికారులు, మండల విద్యాధికారులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై అనంతపురంలో రౌండ్ టేబుల్ సమావేశం





అనంతపురం, ఆగస్టు 3 అనంత సూర్య : డీఎస్సీ--2025 నియామకాల్లో జరిగిన అక్రమాలకు బాధ్యతవహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్ఆర్సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో డీఎస్సీ నియామకాల్లో అక్రమాలపై అనంతపురం అర్బన్ నియోజకవర్గ స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు, కుల సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయకత్వంఓ తెలుగుదేశం, జనసేన, బీజేపీ లు జతకట్టి ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ తో పాటు అనేక హామీలను గుప్పించారని గుర్తు చేశారు. యువతకు ఏటా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తూ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిసా-_మంటూ హామీ ఇచ్చారని తెలిపారు. లేనిపక్షంలో ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని గుర్తు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సి పేరుతో పరీక్షలు నిర్వహించి, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలకు పాల్పడి అనర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని విమర్శించారు. తమకు కావాల్సి వారి కోసమే జీవోలను సృష్టించి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. తక్షణం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని, ఆయన రాజీనామా చేయని పక్షంలో మంత్రివర్గం నుండి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా డీఎస్సి అవకతవకలపై సీబీఐ విచారణ చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో యువతకు చెప్పిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులు, యువతకు చేస్తున్న అన్యాయాలను ఖండిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 6,7,8,9 వ తేదీల్లో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రిలే నిరాహారదీక్షలతో పాటు ఈ నెల 10వ తేదీన ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, య-ువతకు, నిరుద్యోగులకు మద్దతుగా వైయస్సార్ సీపీ చేపట్టబోతున్న రిలే నిరాహారదీక్షలు, నిరసన ర్యాలీకి పార్టీ శ్రేణులతో పాటు మేధావులు, విద్యావంతులతో పాటు పెద్ద ఎత్తున యువతీయ-ువకులు, విద్యార్థులు, రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి






**- ఆకట్టుకునే అభివృద్ధి శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలి**
**- జిల్లా అధికారులకు కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదేశాలు**

పుట్టపర్తి, ఆగస్టు 3 అనంత సూర్య: ఆగస్టు 15న నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు ముందస్తు ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.జాతీయ పతాకావిష్కరణ, వేదిక అలంకరణ, పరేడ్ మైదానం ఏర్పాట్లు, బారికేడింగ్ తదితర పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు గౌరవప్రదంగా ఆహ్వానం పలకాలని, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా శాఖల వారీగా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని, దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విశిష్ట సేవలు అందించిన అధికారులు, ఉద్యోగుల పేర్లను ప్రశంసాపత్రాల కోసం నిర్ణీత గడువులోగా పంపాలని తెలిపారు. కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ, పోలీసు శాఖ తరఫున భద్రత, పరేడ్ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేస్తామని తెలిపారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, ఏఎస్పీ అంకిత సురానా, డీఆర్ఓ కొండయ్య, ఆర్డీవో సువర్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

**సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున**



సింగనమల,ఆగస్టు 3,అనంత సూర్య: అనంతపురం జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి,నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశా-రు.ఈ మేరకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున నాయకత్వంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా జిల్లాలో ఆశించిన మేర వర్షాలు కురవక తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.గత 55 రోజులుగా వర్షం చుక్క కూడా పడకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావం కారణంగా జిల్లాలో విస్తారంగా సాగు చేసిన వేరుశనగ పంటలు ఎండిపోయి, రైతులు భారీ నష్టాలను చవిచూస్తున్నారని పేర్కొన్నారు .వర్షాలు పడతాయనే ఆశతో ముందుగానే ఎరువులు, విత్తనాల కోసం పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు అప్పుల పాలయ్యారని తెలిపారు. తీవ్రమైన ఎండలతో కాలువలు, చెర-ువులు, బోరుబావులు ఎండిపోవడంతో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని ,అనేక గ్రామాల్లో సాగు నీటితో పాటు కనీసం తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు.పశువులకు తాగునీరు, పశు గ్రాసం,దాణా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.అనంతపురం జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించాలని పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, ఉద్యానవన పంటలకు ఎకరాకు లక్ష పరిహారం అందించాలన్నారు. ఎండిపోతున్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ తక్షణమే విడుదల చేయాలని, గ్రామాల్లో పశువుల కోసం ఉచితంగా పశుగ్రాసం, తాగునీటి సదుపాయం కల్పించాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా-ారు.రైతాంగాన్ని, ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసర సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని,ప్రభుత్వం పరిస్థితి తీవ్రతను గుర్తించి ఆలస్యం చేయకుండా రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని మల్లికార్జున కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరనారప్ప, ఎ సూర్య నారాయణ, నరసింహారెడ్డి, కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు బంగారు అవకాశం..

## ఆగస్టు 28న ధర్మవరంలో మెగా జాబ్ మేళా




విజయవాడ, ఆగస్టు 3 అనంత సూర్య: ధర్మవరం నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆగస్టు 28న ధర్మవరంలోని సీఎన్‌బీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సోమవారం సచివాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉద్యోగాల కోసం యువత నగరాలు తిరగాల్సిన అవసరం లేకుండా ప్రముఖ, బహుళజాతి కంపెనీలను ధర్మవరానికే తీసుకొస్తున్నామని తెలిపారు. జాబ్ మేళాలో 90కి పైగా కంపెనీలు పాల్గొని, అర్హులైన అభ్యర్థులకు అక్కడికక్కడే ఉద్యోగాలు కల్పించనున్నట్లు చెప్పారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన 18--35 ఏళ్ల యువతీ, యువకులు అర్హులని, ఎంపికైన వారికి అర్హతను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం లభించే అవకాశముందని వెల్లడించారు.అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫోటోలతో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 8688466361, 9390176421, 9966682246 నంబర్లను సంప్రదించాలని మంత్రి సూచించారు.కార్యక్రమంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు, సంస్కృతి సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆరు నెలలు కేవలం తల్లిపాలే ఇవ్వాలి



కొత్తచెరువు,ఆగష్టు 03, అనంత సూర్య: పతి తల్లి ఆరునెలలు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి అని పుట్టపర్తి సీడీపీఓ ఏ. జయంతి అన్నారు.శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ ప్రమీల ఆదేశాల మేరకు కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీ పరిధిలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అయ్యగారి రజిత ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీఓ జయంతి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు పట్టించడం అత్యంత అవసరమని, మొదటి ఆరు నెలలపాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని,నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతోపాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు పౌష్టికాహారాన్ని ప్రారంభించి, రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను ఇవ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదని పేర్కొన్నారు మరియు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలు మరియు గ్రామస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామంలో ర్యాలీ నిర్వహించారు కార్యక్రమం లో ఐసీడీఎస్ సూపర్వైజర్ రజితతో పాటు సి హెచ్ ఓ రుక్షాన,ఎ ఎన్ ఎం శకుంతలమ్మ అంగన్వాడీ కార్యకర్తలు సుబ్బమ్మ,కృష్ణ కుమారి, స్వర్ణలత,నిర్మల, సుశీల,సాయి లీల,భారతి ఆశ కార్యకర్తలు, రత్నమ్మ,అనిత,రామాంజనమ్మ, నాగమణి,కిశోరి బాలికలు గర్భవతులు బాలింతలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వేదవ్యాస్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి



అనంతపురం, ఆగస్టు 3 అనంత సూర్య : వేద వ్యాస్ జయంతిని అధికారికంగా ప్రకటించి జాతీయ పండుగగా జరపాలని మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షులు జశ్వంత్ వ్యాస్, రాష్ట్ర కార్యదర్శి నారాయణమర్తి కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న కుంటలు, చెరువులు, రిజర్వాయర్లలో మొదటి ప్రాధాన్యత బెస్త కులస్తులకు ఇవ్వాలన్నారు. అలాగే మత్స్య సహకార సంఘాలు, మహిళా మత్స్య సహకార సంఘాలు, మార్కెటింగ్ సహకార సంఘాలు, బెస్తలకు జీవనోపాధి మెరుగు పరచుటకు అనుమతి ఇవ్వాలన్నారు. నిర్వీర్యంలో ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లా మత్స్య సహకార సంఘాలను అభివృద్ధిలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బెస్త వెంకటేష్, మాజీ అధ్యక్షులు బెస్త శివకుమార్, దుర్గాప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405